# విద్య
## వలసవాద, జాతీయవాద భావనలు

కృష్ణ కుమార్

తెలుగు సేత

కాత్యాయని

ఎమెస్కో

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| మొదటి ముద్రణకు ముందుమాట | | 9 |
| రెండవ ముద్రణకు ముందుమాట | | 11 |
| I. పరిచయం | | 15 |

**మొదటిభాగం : వలసీకరణ ప్రక్రియ – గతిచలనాలు**

| | | |
|---|---|---|
| II. | విద్యకు ఆదర్శనమూనాగా వలసరాజ్య పౌరుడు | 27 |
| III. | సముచిత జ్ఞానం:పాఠ్యప్రణాళికకూ – సంస్కృతికీ నడుమ ఘర్షణ | 55 |
| IV. | దుర్బలుడైన నియంత : ఉపాధ్యాయుడి వ్యక్తిత్వంలోని వైరుధ్యం | 84 |

**రెండవభాగం : స్వాతంత్ర్యోద్యమం – గతిచలనాలు**

| | | |
|---|---|---|
| V. | సమానత్వం కోసం అన్వేషణ | 113 |
| VI. | అస్తిత్వ అన్వేషణ | 142 |
| VII. | ప్రగతి – అనేక అర్థాలు | 179 |
| VIII. | ముగింపు | 220 |
| | ఉపయుక్త గ్రంథసూచి | 230 |

# I

# పరిచయం

**ఢి**ల్లీ జంతు ప్రదర్శనశాలకు వెళ్లినప్పుడల్లా మొసలి మీదనో, నీటిఏనుగు మీదనో స్కూలు పిల్లలు రాళ్లు విసురుతున్న దృశ్యం కనబడటం సర్వసాధారణం. ఈ పిల్లలంతా స్కూలు యూనిఫారాల్లో ఉంటారు కాబట్టి, వాళ్లు స్కూలు తరఫున విహారయాత్రకు వచ్చినవాళ్లని సులభంగానే అర్థమవుతుంది. వాళ్లతోబాటు ఒకరో ఇద్దరో టీచర్లు కూడా ఉంటారు. కానీ జంతువుల మీద రాళ్లు విసరటం తగదని వారించే టీచర్లు మాత్రం నూటికో కోటికో ఒకరుంటారు. ఆ జంతువుల గురించి వివరిస్తూ పిల్లల దృష్టిని ఆకట్టుకోగల టీచర్లు మరింత అరుదుగా ఉంటారు. ఆ పిల్లలందరూ గుంపులుగా తిరగటంలో పడిపోయి న్యూఢిల్లీలో వాళ్ల ముందున్న చిత్రమైన ప్రాణిని– అది అడవిగాడిద కానీండి, ఉత్తర అమెరికాకు చెందిన ప్యూమా కానీండి, దాన్ని పట్టించుకోవడం మానేస్తారు. ఈ విధంగా పిల్లల్లో కనబడే ఆసక్తిలేమినీ, హింసాత్మక ప్రవృత్తినీ గమనిస్తూ ఉంటే మన దేశ విద్యావిధానంలోని రాజకీయ స్వభావంపై ఎన్నో ప్రశ్నలు రేకెత్తుతాయి.

ఇక్కడ చెప్పుకున్న ప్రవర్తన వంటిది జంతుప్రదర్శనశాలకే పరిమితమై ఉండదు. ఏ పబ్లిక్ రంగ సంస్థ దగ్గరనైనా ఇలాంటి దృశ్యమే కనబడుతుంది. ముఖ్యంగా అవి జాతీయ సంపదను భద్ర పరిచేవో, ప్రదర్శించేవో అయిన స్థలాల్లో ఈ ప్రవర్తన మరింత ఎక్కువ. ఢిల్లీలోని అద్భుతమైన రైల్వే మ్యూజియంలో స్కూలు పిల్లలబృందాలూ, వాళ్లతోబాటు ఒకరో ఇద్దరో ఉపాధ్యాయులూ కనబడని రోజంటూ ఉండదు. ఐతే ఆ ఉపాధ్యాయులకు మ్యూజియం గురించి ఎలాంటి ఆసక్తీ ఉండదు. వాళ్ల దృష్టంతా కేవలం పిల్లల్ని వరసల్లో నిలబెట్టడం మీదనే ఉంటుంది. మ్యూజియంలోని అపురూపమైన వస్తువులను గురించిగానీ, వాటి వివరాలున్న గ్రంథాలను గురించి ఒక్క మాటయినా చెప్పకుండానే పిల్లలను మ్యూజియం భవనమంతా తిప్పుతారు ఉపాధ్యాయులు. ఏ పిల్లవాడైనా ఆసక్తితో ఏదో వస్తువును దగ్గరగా చూద్దామని ఆగినా, వెంటనే ముందుకు నెట్టేస్తారు. ఒకవేళ ఆ పాప/బాబు

ముందుకు కదలకపోతే నెత్తిన మొట్టి, మరీ ముందుకు తోస్తారు. బహిరంగ ప్రదేశాలకు పిల్లలను తీసుకు వెళ్లినప్పుడు కూడా ఇలాంటి దృశ్యాలే కనబడతాయి. ఆ పురాతనమైన యంత్రాలుగానీ, వాటి ప్రత్యేకతలను వివరిస్తూ రాసిపెట్టిన నోటీసులు కానీ – ఉపాధ్యాయులెవ్వరినీ బొత్తిగా ఆకర్షించవు. పిల్లలు ఏం చూస్తున్నారో, ఏం చూడటం లేదో పట్టించుకోవటానికి బదులుగా వాళ్లు వరసల్లో సక్రమంగా నడుస్తున్నారో లేదో గమనించటమే ఉపాధ్యాయుల ఏకైక లక్ష్యం. వీలయినంత త్వరగా ఈ విహారయాత్ర పూర్తయితే వాళ్లకింకేమీ అక్కర్లేదు.

ఈ విధమైన శిక్షణకు అలవాటయిన సమూహాల్లోని పిల్లలందరూ, ఆఖరికి చిన్న పిల్లలతో సహా – వాళ్ల పరిసరాల్లోని వివరాలను గుర్తించే శక్తిని కోల్పోతూ వస్తారు. క్రమబద్ధమైన దారిలో నడిచి వెళ్లటమనేదే వాళ్లక్కూడా అంతిమలక్ష్యంగా తయారవుతుంది. రైల్వే మ్యూజియంలోని యంత్రాల డిజైన్లను గానీ, జంతుప్రదర్శనశాలలోని రకరకాల జంతువుల ప్రత్యేకతలనుగానీ ఈ పిల్లల కళ్లు పసిగట్టలేవు. యాంత్రికంగా వాటికేసి చూసి, మళ్లీ కదిలి ముందుకు వెళ్తూ ఉంటారు. ఏదీ వాళ్లకు కొత్తగా కన్పించదు, ఆశ్చర్యానందాలను రేకెత్తించదు. ఎక్కడో ఒక అరుదైన పిల్లవాడు ఇందుకు భిన్నంగా కనబడతాడు. కానీ ఆ మాత్రం వైవిధ్యం గల సమూహాలు కూడా చాలా అరుదుగానే ఉంటాయి. మొత్తం సమూహంలోని బాలలందరూ ఉపాధ్యాయుల దృష్టికోణంలోంచే చూడటానికి అలవాటు పడేట్టుగా సామాజీకరించబడతారు. క్రమబద్ధత అనే లక్ష్యాన్ని మరిపించేటంతగా ఏ అనుభవమూ వాళ్లను కదిలించకుండా చూడటమే అంతిమలక్ష్యం.

ఉపాధ్యాయులు ఇంతగా శ్రద్ధ చూపించే ఈ క్రమబద్ధ స్వభావాన్ని కాస్త లోతుగా పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన వాస్తవాలు మనకు బోధ పడతాయి. ఉపాధ్యాయులు ప్రతిక్షణమూ పరిరక్షిస్తున్న క్రమబద్ధతకు–హింసాత్మకతతోనూ, విశృంఖలత్వంతోనూ ఎలాంటి వైరుద్ధ్యమూ లేకపోవటాన్ని చూచి మనం నివ్వెరపోతాం. ఒకటిరెండు క్షణాలసేపు జంతువులను చూడటానికి నిలబడిన పిల్లల్లో ఎవరయినా వాటిమీద రాళ్లు విసురుతూ హింసిస్తూ ఉంటే టీచర్లకు ఎలాంటి అభ్యంతరమూ కనబడదు. మ్యూజియంలో ఎంతో శ్రద్ధగా అమర్చిపెట్టిన యంత్రాలమీద పిల్లలు తమ పేర్లను రాస్తూవున్నా అందులో వారించాల్సినదేమీ కనబడదు. చారిత్రక స్థలాలనూ, స్మృతి చిహ్నాలనూ సందర్శించటానికి వెళ్లిన బడిపిల్లలు (ఇతరులు కూడా) అక్కడి పురాతనమైన గోడలమీద తమ పేర్లనూ, చిన్న సందేశాలనూ రాయటం ఉపాధ్యాయుల కళ్లముందే జరిగిపోతూ ఉంటుంది. భారతదేశంలోని అన్ని పురాతన

కట్టడాల మీదా ఇలాంటి రాతలు కనబడుతూనే ఉంటాయి. ఎంతోమంది ఉపాధ్యాయులు దీన్ని పట్టించుకున్నట్టే కనబడదు. నిజానికి ఇలాంటి ప్రవర్తనను విస్తృతమైన సామాజిక పరిధి నుండి చూసినప్పుడు, అది 'క్రమబద్ధత'ను అతిక్రమించటమే అవుతుంది. అయినప్పటికీ తాము అమలుపరచవలసిన తక్షణ క్రమబద్ధత మీదున్న శ్రద్ధ దీనిమీద ఎవరూ చూపించరు. అపురూపమైన జాతీయసంపద పరిరక్షణ మీదా, జంతువుల మీదా ఉపాధ్యాయుల దృష్టిలో ఎలాంటి ప్రాధాన్యమూ లేనప్పుడు తమ విద్యార్థులు జాతీయసంపదను ధ్వంసం చేయటం గురించీ, జంతువులను హింసించటం గురించీ వాళ్లు పట్టించుకోకపోవటం సహజమే. తాము నిర్వహిస్తున్న వృత్తికీ, ఇలాంటి బాధ్యతలకూ మధ్యన సంబంధం ఉంటుందన్న విషయాన్నే వాళ్లు గుర్తించలేరు.

ఇప్పుడు నేను చెప్పిన సంఘటనల్లాంటి వాటిని ఆధారం చేసుకుని మన పిల్లల్లో 'నాగరక లక్షణం' లేదనీ, అందుకు కారణం వాళ్ల ఉపాధ్యాయులేననీ ఒక నిర్ధారణకు వచ్చెయ్యటం చాలా సులభమే. విద్యా విధానాలకు సంబంధించిన సాంప్రదాయిక దృక్పథాలు ఇలాంటి నిర్ధారణలను నిరభ్యంతరంగా ఆమోదిస్తాయి కూడా. ఈ విధమైన సూత్రీకరణలతో ఎవరో ఒక భారతీయ మేధావి విద్యారంగ సంక్షోభాన్ని గురించి ఏదో ఒక విమర్శను ప్రకటించటం నిరంతరం జరుగుతూనే ఉంటోంది. గత నూటయాభై సంవత్సరాలుగా ఇలాంటి చర్చలకు మనం అలవాటుపడిపోయాం. అందువల్లనే ఈ విశ్లేషణలనూ, వాటిలో పేర్కొంటున్న పరిభాషనూ ప్రశ్నించటమనేది కష్టమైన పనిగా మారిపోయింది. అయినప్పటికీ 'నాగరక లక్షణం లోపించటం' వంటి మాటలు ఎంత అస్పష్టతతో కూడినవో మనం గుర్తించితీరాలి. ఈ మాట అస్పష్టమైనదని ఎందుకంటున్నామంటే – మనం ఇంతవరకూ చెప్పుకున్న ప్రవర్తనలన్నీ 'నాగరక' లక్షణాలలో భాగంగా జరుగుతున్నవే. ఐతే అది విధ్వంసకరమైన స్పృహ. ఉపాధ్యాయులు కాపాడాలను కుంటున్న క్రమబద్ధత కూడా 'నాగరక' లక్షణం కలిగినదే. ఐతే ఆ స్పృహను వాళ్లు పిల్లలకూ – సామాజిక సంపదకూ మధ్యన ఉండాల్సిన సంబంధాన్ని గుర్తించేందుకు ఉపయోగించక పోవటమే అసలు సమస్య. ఎందుకు గుర్తించలేకపోతున్నారు? దీనికి నా సమాధానమేమిటంటే, మన విద్యావిధానంలోని జ్ఞానసిద్ధాంతం ఉపాధ్యాయులను 'క్రమబద్ధత'ను కాపాడటమనే బాధ్యత దగ్గరే ఆపివేస్తోంది. ఈ విధంగా ఒక సంకుచితమైన పరిధికి ఉపాధ్యాయుల దృష్టిని పరిమితం చేసిన జ్ఞాన సిద్ధాంతం ఎలా రూపొందిందో మనం పరిశీలించాలి. అందుకోసం మన విద్యావిధానంలో ఇమిడివున్న వివిధ భావనల చరిత్రను, ముఖ్యంగా రాజకీయ భావనలను గురించి తెలుసుకోవాలి.

## వలసప్రాంతంలో జ్ఞానం

'జ్ఞానం' అనే మాటను విద్యకూ, పాండిత్యానికీ సంబంధించి 'సముచితమైన' లేక 'చలామణి'లో ఉన్న జ్ఞానమనే అర్థంలో నేనిక్కడ వాడుతున్నాను.[1] ఇవాళ మన స్కూళ్లలోనూ, కాలేజీల్లోనూ 'న్యాయబద్ధమైన జ్ఞానం' పేరిట జరుగుతున్న బోధన వెనుక అతి నిర్దిష్టమైన సాంస్కృతిక, ఆర్థిక ఒత్తిడులున్నాయి: అదే వలసపాలనకు సంబంధించిన ఒత్తిడి. ఈ ఒత్తిడి తీవ్రత పందొమ్మిదవ శతాబ్ది నాటి భారతీయ సమాజంపై ఎంతగా ఉండి ఉంటుందనే విషయాన్ని ఈ ఇరవయ్యవ శతాబ్దపు చివరిపాదంలో నిలబడి అంచనావెయ్యడం అంత సులభమేమీ కాదు. ఈనాటి మన విద్యాలయాల్లో జరుగుతున్న బోధనకూ, పందొమ్మిదవ శతాబ్దంలో పాఠశాల విద్యగా ఆమోదాన్ని పొందిన జ్ఞానానికీ మధ్య సంబంధం ఉందన్న విషయం కూడా సులభంగా బోధపడదు. భారత సమాజంమీదా, సంస్కృతి మీదా వలసపాలన కలిగించిన ప్రభావాల చిహ్నాలు ఇవాల్టి మన పాఠశాల విద్యా ప్రణాళికల్లో ప్రతిఫలిస్తున్నాయంటే మనం నమ్మలేం. మనకు లభించిన రాజకీయ స్వాతంత్ర్యం మనల్ని ఇలాంటి భ్రమల్లోకి నెడుతున్నది.

వలసపాలకులు ఆమోదించిన పాఠశాల విద్యకూ – ఇవాల్టి మన పాఠ్యప్రణాళికలూ, బోధన విధానాలకూ మధ్య సంబంధం ఉండటమే కాదు, 'ఉత్తమ విద్యాబోధన' ఎలా ఉండాలనే విషయంలో ఇవాళ మనం చేస్తున్న ఆలోచనలు కూడా వలసవాద దృక్పథంతో ప్రభావితమైనవే. వలసపాలన నాటి భారతదేశంలో పాఠశాలల్లోని విద్యాప్రణాళికను నిర్ణయించటం, ఎన్నిక చేయటం, రూపకల్పన చెయ్యటం అనే విధులన్నిటినీ 'జ్ఞానులైన వెలుపలివాళ్లే' నిర్వహించారు. భారతదేశంలో ఒక విద్యావ్యవస్థను రూపొందించి అభివృద్ధి పరిచే ప్రక్రియలో బ్రిటిష్ అధికారులూ, మిషనరీలూ పాలుపంచుకున్నారు. ఇలా 'వెలుపలి జ్ఞానుల' దృష్టికోణం నుండి చూసినప్పుడు స్థానిక ప్రజల జ్ఞానమూ, నైపుణ్యాలూ విద్యారంగానికి పనికిరానివిగానే కన్పించాయి. అంతేగాక, ఆ స్థానికులు 'అజ్ఞానానికి' ప్రతీకలుగానూ కనబడ్డారు. వలస విద్యావిధానం విస్తరించిన కొద్దీ 'వెలుపలి జ్ఞానుల' పాత్రల్లోకి విద్యావంతులైన భారతీయులు ప్రవేశించారు. వాళ్లు కూడా సాధారణ ప్రజలపాలిట 'వెలుపలి జ్ఞానులే'. ఇందుకు భిన్నంగా ప్రవర్తించిన కొద్దిమంది భారతీయ విద్యావంతులున్నారు. 'జ్ఞానులుగా' మారిన భారతీయులెవ్వరూ ఆంగ్లేయులు రూపొందించిన బోధన విధానాలనూ, పాఠ్యాంశాలనూ, వాచకాలనూ నామమాత్రంగానైనా ప్రశ్నించలేదు. విద్యావ్యవస్థపై విమర్శలు చేసినవాళ్లు ఎందరో ఉన్నారు. కానీ వలసపాలన కాలంలో ఆమోదం పొందిన మౌలికమైన జ్ఞానవ్యవస్థలూ, వాటిని విద్యావిధానంలోకి ప్రవేశపెట్టిన